# 25లోపు దుకాణాలను కేటాయిస్తాం

## బేగంబజార్ ఫిష్ మార్కెట్‌ను సందర్శించిన మంత్రి తలసాని

అబిడ్స్, జూన్ 19: అధునాతనంగా నిర్మించిన బేగంబజార్ ఫిష్ మార్కెట్‌లో అర్హులైన వారికి ఈ నెల 25వ తేదీ లోపు దుకాణాలను కేటాయిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన బేగంబజార్ ఫిష్ మార్కెట్‌ను అధికారులతో కలిసి సందర్శించారు. స్థానికంగా చేపలు విక్రయించే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు, వినియోగదారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తూ రూ.10 కోట్లతో గ్రౌండ్, మూడు అంతస్తులతో భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. కొన్ని దుకాణాలను అర్హులైన పాతవారికి కేటాయించామని, మిగిలిన దుకాణాలను ఇక్కడే వ్యాపారాలు చేసుకుంటున్న అర్హులైన వారికే కేటాయిస్తామన్నారు. ఈ దుకాణాల కేటాయింపునకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ముగ్గురు కమిటీ సభ్యులు అర్హులైన వ్యాపారులను గుర్తించి వారికి దుకాణాల కేటాయింపు జరిగేలా చూస్తారన్నారు. మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, అదనపు డైరెక్టర్ రాథోడ్, మత్స్య శాఖ అధికారి చరితారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



## ఐటీ కారిడార్‌లో మరో లింకు రోడ్డు

ఐటీ కారిడార్‌లో మరో లింకు రోడ్డు అందుబాటులోకి వచ్చింది. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి ఐఎస్‌బీ మీదుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వెళ్లే ప్రధాన రహదారిలో టీఎన్‌జీవో కాలనీకి వెళ్లేలా విశాలమైన లింకు రోడ్డు నిర్మాణం పూర్తయి రాకపోకలు కూడా సాగుతున్నాయి. అత్యంత రద్దీ కలిగిన ప్రాంతాల్లో విప్రో సర్కిల్ ఒకటి. ఇక్కడి నుంచి నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి, కోకాపేట, గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ వైపు వెళ్లాలంటే వాహనదారులు నిమిషాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కావడంతో వాహనాల రాకపోకలకు అనుమతులిచ్చారు. టీఎన్‌జీవో కాలనీ నుంచి నేరుగా ఐఎస్‌బీ రోడ్డుకు కలిసేలా లింకు అందుబాటులోకి రావడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ)



## హోం మంత్రికి వినతి

నాంపల్లి కోర్టులు, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : జీతాలు పెంచాలని, ఆరోగ్యబీమా కార్డులు ఇవ్వాలని కోరుతూ హోం మంత్రి మహమూద్ అలీకి తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంఘం తరపున సోమవారం వినతిపత్రం సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో నాంపల్లి కోర్టు ఏపీపీలు యాదగిరి, ప్రతాప్ రెడ్డి, రాంరెడ్డి, జాఫర్, రచ్చ శ్రీనివాస్, ముకుంద్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మిలిటరీ ఇంజినీర్లకు ఎస్కీలో శిక్షణ



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ రామేశ్వర్ రావు

సిటీబ్యూరో, జూన్ 19(నమస్తే తెలంగాణ) : గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ(ఎస్కీ)లో మిలిటరీ ఇంజినీర్ అధికారులు(ప్రొబేషనరీ) శిక్షణ పొందుతున్నారు. ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా 20 రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఎస్కీ డైరెక్టర్ రామేశ్వర్ రావు సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్, వాటర్ సప్లయ్ ట్రీట్‌మెంట్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ, వ్యర్థ జలాలు, మానవ వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ పద్ధతులతో పాటు ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. క్లాస్ రూం ట్రైనింగ్‌తోపాటు, అసైన్‌మెంట్, సైట్ విజిటింగ్, ఇంటిగ్రేషన్ ఇంజినీరింగ్ అంశాలపై మిలిటరీ అధికారులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## ఉల్లాసంగా ఐస్‌క్రీం టేస్టింగ్ చాలెంజ్




సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): హైబిజ్ టీవీ–విజయా డెయిరీ తెలంగాణ 'ది గ్రేట్ ఇండియన్ ఐస్‌క్రీం టేస్టింగ్ చాలెంజ్' కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చింది. హైటెక్స్ వద్దగల మైదాన్ ఎక్స్‌పో సెంటర్‌లో జరిగిన ఈవెంట్‌లో కండ్లకు గంతలు కట్టుకొని ఐస్‌క్రీం టేస్ట్ చేస్తూ... ఉత్సాహంగా గడిపారు. ముఖ్యఅతిథిగా విజయా డెయిరీ తెలంగాణ చైర్మన్ సోమా భరత్‌కుమార్ హాజరయ్యారు. ఈ సదంర్భంగా ఎల్బీనగర్‌కు చెందిన భవానీ రూ.లక్ష నగదు మొదటి బహుమతిని గెలుచుకున్నది. రెండో బహుమతి కొండాపూర్‌కు చెందిన సల్మా రూ.50వేలు, మూడో బహుమతి రూ.25వేలు ఉప్పల్‌కు చెందిన దుర్గాప్రసాద్‌రెడ్డి, నాలుగో బహుమతి కింద 10 మందికి రూ.5వేల చొప్పున అందజేశారు.

# మహిళా ఆరోగ్యమే ప్రధానం

## ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ స్మితా సబర్వాల్

చార్మినార్, జూన్ 19 : మహిళల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని, ఇందులో భాగంగానే గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నదని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ స్మితా సబర్వాల్ తెలిపారు. సోమవారం ఆమె పేట్లబుర్జులోని ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆసుపత్రిని సందర్శించి గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ స్మితా సబర్వాల్ మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళల భద్రత, ఆరోగ్యరక్షణకు ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. ఈ కిట్‌లలో గర్భిణులు తీసుకోవలసిన ఆహారం, మందులు ఇతర పోషకాలు ఉన్నాయని తెలిపారు. పోషకాహారం తీసుకుంటూ తల్లీబిడ్డా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం 200 మంది గర్భవతులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాలతీతో పాటు ఆర్ఎంఓలు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లను పంపిణీ చేసి విజిటింగ్ బుక్‌లో సందేశాన్ని రాస్తున్న ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ స్మితా సబర్వాల్

## నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని జగన్నాథ ఆలయం నుంచి ఉదయం 11 గంటలకు శ్రీ జగన్నాథ రథయాత్ర ప్రారంభం.
- అబిడ్స్‌లోని ఇస్కాన్ హరేకృష్ణ మందిర్ నుంచి మ.12 గంటలకు రథయాత్ర.
- సికింద్రాబాద్ ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో మ.1.30 గంటలకు రథయాత్ర.
- సికింద్రాబాద్ శ్రీజగన్నాథ స్వామి రాంగోపాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు రథయాత్ర.
- కూకట్‌పల్లి జేఎన్టీయూహెచ్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ విద్య దినోత్సవం.

గమనిక: నగరంలో జరిగే కార్యక్రమాల వివరాలను ntgcitybureau@gmail.com కు పంపగలరు.

# 25 వేల మంది విద్యార్థులతో ఒలింపిక్ డే రన్



మాట్లాడుతున్న టీఎస్ఈడబ్ల్యూడీసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి జూన్ 19 : గ్రేటర్‌లోని 13 సెంట్రల్ నుంచి భారీ ఎత్తున ఒలింపిక్ డే రన్‌కు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్టు టీఎస్ఈడబ్ల్యూడీసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి ప్రకటించారు. సోమవారం తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాలచారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఒలింపిక్ డే రన్‌లో భారీ సంఖ్యలో విద్యార్థులతో పాటు క్రీడాకారులు పాల్గొనే విధంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కే.జగదీశ్వర్ యాదవ్, కోశాధికారి కే.మహేశ్వర్ సాగర్, ఉపాధ్యక్షుడు ఎస్ఆర్.ప్రేమ్‌రాజ్, కార్యదర్శి నార్మన్ ఐసాక్, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సతీశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బయో మెడికల్ పరిశోధన కోసం..

మాదాపూర్, జూన్ 19: బయో మెడికల్ పరిశోధన కోసం ఎస్ఈటీయూ ఐర్లాండ్‌తో కేఎల్ డీమ్డ్ టు బీ వర్సిటీకి చెందిన కేఎల్‌హెచ్ హైదరాబాద్ వర్చువల్ ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నది. 'కేఎల్' డీమ్డ్ టు బీ యూనివర్సిటీకి చెందిన కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ హృదయ సంబంధ పరిశోధనలను నిర్వహించే లక్ష్యంతో ఉన్న ఎస్ఈటీయూ ఐర్లాండ్‌తో భాగస్వామ్యం చేసుకోవడం సంతోషకరమని కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వీసీ, డాక్టర్ పార్థసారథి రెడ్డి తెలిపారు.

## టీహబ్‌తో అర్బన్‌కో ఒప్పందం



సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యుత్తమ స్టార్టప్ ఎకో సిస్టం కలిగిన టీ హబ్‌తో మాల్దీవ్స్‌కు చెందిన అర్బన్‌కో సంస్థ వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సుస్థిరమైన నగరాల నిర్మాణం కోసం ఆధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలను వినియోగించుకునే అంశంపై పరస్పరం ఒప్పందాన్ని చేసుకున్నారు. ఈ సందర్భంగా టీ హబ్ సీఈవో ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మాల్దీవుల్లో స్మార్ట్, స్థిరమైన నగరాలను సృష్టించే ప్రయత్నంలో అర్బన్‌కోతో భాగస్వామ్యం కుదిరిందని, శక్తివంతమైన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ కలిగిన టీ హబ్ దీని ద్వారా మంచి ఫలితాలను సాధిస్తుందన్నారు. అర్బన్‌కో సంస్థ దూరదృష్టిని వాస్తవంగా మార్చడంలో ఈ ఒప్పందం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అర్బన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ అతీఫ్ పాల్గొన్నారు.

## ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ ఎదుర్కోలు

అమీర్‌పేట్,జూన్19 : బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారి ఎదుర్కోలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి జరిగిన ఎదుర్కోలులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా శివసత్తుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఎల్లమ్మ కల్యాణం మంగళవారం జరుగనుంది. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో కల్యాణం ఏర్పాట్లు జరిగాయి.

